

చైనా మాంజా.. డేంజర్
సంక్రాంతి పండగ సందర్భంగా చిన్నా, పెద్ద పతంగులు ఎగురవేస్తారు. కానీ ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. 8లో



అర్ధరాత్రి అగ్నిప్రమాదం
వర్గల్ నాచగిరి క్షేత్రం వద్ద బొమ్మల దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. రెండు దుకాణాలు పూర్తిగా దహనమైపోగా, మరో మూడింటికి పాక్షిక నష్టం వాటిల్లింది. 8లో



కంటి వెలుగును పకడ్బందీగా చేపట్టాలి
ప్రజల కంటి సమస్యలను తీర్చేందుకు నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు వైద్యశిబిరాలను విజయవంతం చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. 9లో

ముగ్గు మీది.. ప్రచురణ మాది



రంగవల్లులు వేయడం మీకు ఇష్టమా..? ఆకర్షణీయంగా ముగ్గులు వేస్తారా..? సంక్రాంతి పండగ సందర్భంగా శనివారం మీ వాకిట్లో అందంగా వేస్తారా.. అయితే దాన్ని మాకు వాట్సాప్ చేయండి.
'సాక్షి' పత్రికలో ప్రచురిస్తాం.
ఫోన్ నంబర్: 8985554525

న్యూస్‌రీల్

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

విద్యుత్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగ్



సభ్యత్వం తీసుకున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతం పోరాటం చేస్తామని విద్యుత్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ అన్నారు. శుక్రవారం చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లి సబ్ స్టేషన్‌లో మండల జూనియర్ లైన్‌మెన్‌లు రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం నూతన సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింగ్‌తోపాటు, డివిజన్ కార్యదర్శి అశోక్‌లు మాట్లాడుతూ.. తమ కార్మిక సంఘం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. నూతన సభ్యత్వం తీసుకున్న జూనియర్ లైన్‌మెన్ గణేశ్, ఆర్టీజన్ నాచ్య, రూప్‌సింగ్‌లను వారు అభినందించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేశ్వరరావు, ఆర్టీజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి, నాగరాజు, కృష్ణ, తౌఫిక్ అలీ, మల్లేశం, యాదుల్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల నిర్వహణ భేష్



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నర్సాపూర్: పాఠశాలల యాజమాన్యాలు విద్యా బోధనతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎస్‌ఐ గంగరాజు చెప్పారు. పట్టణంలోని గిరిదీపం పాఠశాల యాజమాన్యం స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం పట్టణంలోని పలు వీధుల గుండా 5కే రన్ చేపట్టగా, ఎస్‌ఐ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు, పరుగు, వాకింగ్ చేయడంతో శారీరక దృఢత్వం పొందడంతో పాటు ఏకాగ్రత వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, 10వ వార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్, పాఠశాల డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ కవితరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నివాసాల తొలగింపు



అటవీ భూమిలో నివాసాలు తొలగిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): అటవీ భూమిలో అక్రమంగా వేసిన నివాసాలను శుక్రవారం సిబ్బంది తొలగించారు. మండల పరిధిలోని బీమ్లా పంచాయతీ పరిధిలో అటవీ భూమిలో పలువురు గిరిజనులు రాత్రి వేళలో నివాసాలు ఏర్పాటు చేశారు. అటవీ శాఖ అధికారులకు తెలియడంతో శుక్రవారం అటవీ డిప్యూటీ రెంజ్ అధికారి రవికుమార్ ఇతర సిబ్బంది అక్రమంగా అటవీ భూమిలో వేసిన నివాసాలను తొలగించారు. నివాసాల కోసం ఏర్పాటు చేసిన సామగ్రిని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. అటవీ భూమిని అక్రమించుకునేందుకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అటవీ డిప్యూటీ రెంజ్ అధికారి రవికుమార్ అన్నారు.

బాల కార్మికులకు అండగా..

- కొనసాగుతున్న 9వ విడత 'ఆపరేషన్ స్మైల్'
- తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- 12 రోజుల్లో 36 మందిని గుర్తింపు
- హోటళ్లు, ఇటుక బట్టీలు, బస్టాండ్‌లో విస్తృత తనిఖీలు



ఆపరేషన్ స్మైల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు (ఫైల్)

మెదక్‌జోన్: బాలలకు అండగా ఆపరేషన్ స్మైల్ నిలుస్తుంది. చిన్నతనంలోనే పనులు చేస్తున్న బాలలను గుర్తించి, వారి భవిష్యత్‌ను తీర్చిదిద్ది, విద్యావంతులుగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈనెల 1నుంచి 30 తేదీ వరకు నెల రోజుల పాటు మహిళలు, బాలల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

- జిల్లాలో 9వ విడత ఆపరేషన్ స్మైల్ కొనసాగుతుంది. బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతీ ఆరు నెలలకోసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.
- ఈసారి జనవరి 1 నుంచి మొదలైన కార్యక్రమం 31వ తేదీ వరకు కొనసాగుతుంది. హోటళ్లు, ఇటుక బట్టీలు, బస్టాండ్‌లే లక్ష్యంగా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.
- గడిచిన 12 రోజుల్లో 36 మంది బాల కార్మికులను గుర్తించారు.
- అందులో 25 మంది బాలురు కాగా 11 మంది బాలికలు ఉన్నారు. వారందరికీ విముక్తి కలిపించి పలువురు యజమానాలకు జరిమానా విధించిన అధికారులు బాలలను పాఠశాలల్లో చేర్పించారు.
- ప్రతీయేటా ఈ కార్యక్రమం కోసం కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. పోలీస్, కార్మికశాఖ, బాలల సంరక్షణ శాఖల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేసి దాడులు నిర్వహిస్తారు.
- ఇటీవల ఎస్పీ రోహిణీప్రియదర్శిని సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఆపరేషన్ స్మైల్‌పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఇటుక బట్టీలు, హోటళ్లలో..

- జిల్లాలో వేలాదిగా ఇటుక బట్టీలు ఉన్నాయి. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చి పనులు చేస్తుంటారు.
- వలస కూలీల పిల్లలు ఈ బట్టీల్లో వారి తల్లిదండ్రులతో పాటు పని చేస్తున్నారు. ఫలితంగా వారి బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలతోంది.
- ఇలాంటి వారిని గుర్తిస్తున్న అధికారులు వారిని పనుల నుంచి విముక్తి కల్పించి పాఠశాలలకు పంపుతున్నారు.
- ముఖ్యంగా 18 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయిస్తే సదరు యజమానికి రూ.20 వేలు జరిమానా విధించనున్నారు.
- జిల్లాలో మెదక్, రామాయంపేట, చేగుంట, నర్సాపూర్, హవేలీఘనపూర్, కౌడిపల్లి, కొల్చారం తదితర మండలాల్లో అత్యధికంగా బట్టీలు కాల్చుతుంటారు. వీటిలో అధికారులు తనిఖీలు చేపట్టారు.
- 2017లో ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలు ప్రారంభం కాగా ఇప్పటి వరకు గడిచిన ఆరేళ్లలో 1,021 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు.

పనిలో పెట్టుకుంటే చర్యలు



18 ఏళ్లలోపు పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో పనిలో పెట్టుకోవద్దు. ఒక వేళ పెట్టుకుంటే వారు శిక్షార్హులు అవుతారు. అలాంటి వారికి సుమారు రూ.20 వేల వరకు జరిమానా విధిస్తాం. జనవరి 1వ తేదీ నుంచి ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ప్రారంభమైంది. ఇది నెలాఖరు వరకు జిల్లాలో కొనసాగుతుంది. ఇప్పటి వరకు 36 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించాం.
– కరుణశీల, బాలల సంరక్షణ అధికారిణి

పోతరాజుపల్లిలో కేసు నమోదు

తూప్రాన్: ఆపరేషన్ స్మైల్‌లో 9లో భాగంగా ఇటుక బట్టీల్లో బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్న నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ తుమ్మరాజు శుక్రవారం పేర్కొన్నారు. పట్టణంలో ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న ఇటుక బట్టీల్లో పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. మున్సిపల్ పరిధిలోని పోతరాజుపల్లి గ్రామ సమీపంలో గీతారెడ్డి కాలనీలో రావెల్లి గ్రామానికి చెందిన బోల్లపోయిన మల్లేశ్ యాదవ్ అనే వ్యక్తి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ఆకాశ్‌మొండ (16), పూజా మొండ (15)తో బట్టీలో పని చేయిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయం తూప్రాన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భవిష్యత్‌లో ప్రజలకు ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న జితేందర్

మెదక్‌జోన్: రాబోవు రోజుల్లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవ అందుతుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ జితేందర్ అన్నారు. ఈ విషయాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. శుక్రవారం మెదక్ కోర్టు ఆవరణలో మధ్యాహ్నం 1 గంటలకు నూతనంగా ఏర్పడిన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ వారి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థతో పనులు, సేవలు, సభ్యుల బాధ్యతలు, ఇతర ముఖ్య అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ జితేందర్ మాట్లాడుతూ.. జిల్లా న్యాయ సేవ సంస్థ రాబోవు కాలంలో చేయబోయే కార్యక్రమాలు, సామాన్య ప్రజానీకానికి అందాల్సిన ఫలాలు, దానికి రూపొందించాల్సిన అంశాలను వివరించారు. ఈ న్యాయ సేవా సంస్థకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రెసిడెంట్ బాలయ్య వారి సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలయ్య, నామినేటెడ్ సభ్యులు కరుణాకర్, ప్యానల్ అడ్వకెట్స్ సీనియర్ అడ్వకేట్‌లు, జూనియర్ అడ్వకేట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో శిబిరాల ఏర్పాటు

- నిర్వహణ బాధ్యత మండల అధికారులదే
- ప్రతీ మండలంలో ఐదు నుంచి ఆరు కేంద్రాలు
- 'కంటి వెలుగు'పై అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: కంటి వెలుగును ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కంటి వెలుగు నిర్వహణ ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రెండో విడత కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చక్కటి ప్రణాళికతో ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని మండల ప్రత్యేకాధికారులకు సూచించారు. ప్రతీ మండలంలో 5 నుంచి 6 శిబిరాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. శిబిరాల నిర్వహణ బాధ్యత మండల వైద్యాధికారులదే నని ప్రధానంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ వంటి భవనాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏ రోజు ఏ ప్రాంతం నుంచి ఎంత మంది రావాలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, స్వయం సహాయక సభ్యులు ప్రజలకు అవగాహన కలిగించి కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రజలకు ఒకరోజు ముందుగా టోకెన్లు ఇవ్వాలని, శిబిరానికి వచ్చేటప్పుడు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకురావాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని చౌక ధరల దుకాణాలు, పెట్రోల్ బ్యాంక్‌లు, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ప్రాంతాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో చాటింపు వేయించాలన్నారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో శిబిరాల ప్రారంభం

ఈ నెల 18న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో శిబిరాలను ప్రారంభించి వారి చేతుల మీదుగా రీడింగ్ అద్దాలు అందించేలా చూడాలని అదనపు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చందునాయక్, డీపీఓ రాజేంద్రప్రసాద్, మండల ప్రత్యేకాధికారులు జయరాజ్, శ్రీనివాస్, విజయ శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, కేశూరం, కృష్ణ మూర్తి, బ్రహ్మాజీ, విజయలక్ష్మి, ఇందిర, నాగరాజ్, కరుణ, ఆశ కుమారి నర్సయ్య, రజిని, భీమయ్య, డాక్టర్ సుమిత్ర, డాక్టర్ నవీన్, 40 బృందాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం



తరలివచ్చిన భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో శ్రీ గోదా రంగనాథుల కల్యాణోత్సవాన్ని శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాష్యం మధుసూదనచార్యుల వేదమంత్రాల నడుమ వైభవంగా జరిగిన కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కల్యాణం సందర్భంగా భక్తులు ఆలపించిన కీర్తనలు అలరించాయి. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చి, అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు జయశ్రీ దుర్గా ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ మేడి మధుసూదన్ రావు, ఆర్కే శ్రీను పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, నందిని శ్రీను, బద్రినాథ్, పురుషోత్తం, సకిలం శ్రీనివాస్, నగరం మల్లేశం, దేవేందర్ రెడ్డి, రాందేవ్, బాల్ రాజ్, భక్తులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: క్రీడాకారులు మరింత కృషి చేసి ఉమ్మడి జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 8 వరకు హైదరాబాద్‌లోని బండ్లగూడ మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జరిగిన టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా తృతీయ బహుమతి సాధించడంపై ప్రతిమాసింగ్ సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం తన ఛాంబర్ లో గెలుపొందిన క్రీడాకారులు గబ్బుల అర్నీత్, రవితేజ, అనిష్, కిషోర్, నరేశ్, విశ్వేశ్వర్, శ్రీనివాస్ చారి, సాయి ప్రణీత్, నరేశ్‌లకు మెడల్స్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాను ప్రథమ స్థానం తీసుకొచ్చేందుకు క్రీడాకారులు మరింత కృషి చేయాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ కె.ప్రభు, సభ్యులు మురళీధర్, జూలకంటి శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, విశ్రాంత పీడీ ఆనందం, అంబుడ్స్ మెన్ అడ్వకేట్ శిరిగ ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): రైతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం పేట మండలం జంగరాయి గ్రామంలో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం భవనం ప్రారంభించారు. అలాగే చిన్నశంకరంపేట నుంచి జంగరాయి వరకు రూ.1.30 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు పథకం ద్వారా చేయూతనిస్తుందని అన్నారు. చిన్నశంకరంపేట నుంచి జంగరాయి రోడ్డుకు ముందుగా రూ.95 లక్షలు మంజూరు చేయగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రావడం లేదని, అదనంగా మరో రూ.35 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన రోడ్డును అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పేట ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ మాధవి, సర్పంచ్ జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్రిష్ణాగౌడ్, ఎంపీడీఓ గణేశ్ రెడ్డి, ఉప తహసీల్దార్ మహేందర్‌గౌడ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ సొసైటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు రమాదేవి, యాదగిరి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు కుమార్‌గౌడ్, లక్ష్మణ్, రవిందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మల్లన్న సేవలు మరింత ప్రియం

- పట్నం టికెట్ల ధర పెంచాలని నిర్ణయం
- భక్తుల నుంచి విమర్శల వెల్లువ

పట్నాల ధర పెంపు ఇలా(రూ.లలో)..

పట్నం	పాతవి	కొత్తవి
చెలుక	80	150
నజరు	100	200
ముఖ మండప	200	300



రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి సేవలు సామాన్య భక్తులకు భారం కానున్నాయి. పట్నాల టికెట్ ధరల పెంపునకు పాలకమండలి సమావేశంలో తీర్మానం చేశారు. టికెట్ల ధరలు రెట్టింపు చేస్తున్నారన్న సమాచారంతో భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే 2016లో పెంచిన ఆర్జిత సేవల టికెట్ ధరలను మరోసారి పెంచాలని ఒగ్గు పూజారులు పలుమార్లు ఈఓ బాలజీ వినతి పత్రాలు అందించడం గమనార్హం. కాగా గతేడాది ఈ పట్నాల ధరలు పెంపు నిర్ణయం తీసుకోగా పెంచొద్దని పలు పార్టీలు, భక్తులు వినతి పత్రాలు అందించగా అప్పుడు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల 11వ తేదీన పాలక మండలి మరోసారి పట్నాల టికెట్ ధరలు పెంపునకు నిర్ణయం తీసుకుంది. పెంపు అనివార్యమైతే మల్లన్న భక్తులపై మరోసారి భారం పడనుంది.

గతేడాది రూ.1.81 కోట్లు ఆదాయం

ప్రస్తుతం ఆలయ వార్షిక ఆదాయం సుమారు రూ.20 కోట్ల వరకు ఉంటుంది. ఇందులో అధికాదాయం పట్నాల టికెట్ల ద్వారానే వస్తుంది. ప్రతీ ఏట లక్షలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి భక్తులు పట్నాలు, బోనాలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఈ టికెట్ల ద్వారా వచ్చే ఆదాయంలో సగ భాగాన్ని పట్నాలు వేసే ఒగ్గు పూజారులకు చెల్లిస్తున్నారు. గతేడాది మూడు రకాల పట్నాలు, ఎల్లమ్మ, మల్లన్న బోనాల టికెట్ల ద్వారా రూ.1.81 కోట్లు ఆదాయం వచ్చింది. అందులో రూ.86 లక్షలు 154 మంది ఒగ్గు పూజారులకు చెల్లించారు. టికెట్ ధరల ప్రతిపాదనలను దేవదాయశాఖకు పంపినట్లు సమాచారం. ఈ టికెట్ల ధర పెంపు వెనుకాల పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆలయ అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కేవలం 159 మంది ఒగ్గు పూజారుల ఆర్థిక లబ్ధి కోసమే భక్తులపై భారం మోపుతున్నారని స్థానికంగా చర్చించుకుంటున్నారు. భక్తులు ధరల పెంపును నిలిపివేయాని ఉన్నత అధికారులను కోరుతున్నారు.

నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



ఆలయ అధికారులు టికెట్ల ధర పెంపు నిర్ణయాని వెంటనే వెనక్కి తీసుకోవాలి. కొంత మంది ఆర్థిక లాభం కోసం లక్షలాది మంది భక్తులపై ఆర్థిక భారం మోపొద్దు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అవినీతికి పాల్పడుతున్న అధికారులను సస్పెండ్ చేయాలి.
– శ్రీనివాస్‌రెడ్డి, మల్లన్న భక్తుడు

అభ్యంతరాల స్వీకరణ తర్వాతే..



గత పాలక మండలి పట్నాల టికెట్ల ధరను పెంచేందుకు తీసుకున్న నిర్ణయంతో భక్తుల అభిప్రాయ సేకరణ చేశాం. గ్రామ పంచాయతీ వారు టికెట్ల ధర పెంపుపై తమకు సంబంధం లేదని తీర్మానం ఇచ్చారు. వాటికి అనుగుణంగా ధరలు పెంచుతున్నాం. ఇందులో ఎలాంటి అవినీతికి తావులేదు.
– బాలాజీ, ఈఓ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌ దుర్మరణం


ప్రతాప అరుణ్‌ (ఫైల్‌)

పటాన్‌చెరుటౌన్‌: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ దుర్మరణం చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌ జిల్లా హుజురాబాద్‌కు చెందిన ప్రతాప శ్రీనివాస్‌ కుమారుడు ప్రతాప అరుణ్‌ (25) బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌ వచ్చాడు. ఆనంద్‌ సెంట్రింగ్‌ మేస్త్రీ వద్ద ఆటోడ్రైవర్‌ గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం పనిపై పటాన్‌చెరు వచ్చి, బైక్‌పై తిరిగి వెళ్తుండగా నవపాన్‌ సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

మద్దూరు(హుస్నాబాద్‌): ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన సంఘటన మండలంలోని లద్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు ముచ్చల కృష్ణారెడ్డి గురువారం ఇంటి ముందు ఎప్పటిలాగే బైక్‌ను పార్క్‌ చేశాడు. ఉదయం లేచి చూసే సరికి ఏపి 10ఏజె9980 బైక్‌ కనిపించలేదు. దీంతో వాహనాన్ని చోరీ చేశారని బాధితుడు లబోదిబోమన్నారు.

దుండగులను అరెస్ట్‌ చేయాలి


మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు కనకయ్య

సిద్దిపేటఎడ్యుకేషన్‌: నిజామాబాద్‌ జిల్లా కోటగిరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడిచేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని నవజీవన్‌ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ సొసైటీ అధ్యక్షులు కనకయ్య డిమాండ్‌ చేశారు. శుక్రవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడితో క్షమాపణలు చెప్పించడం సరికాదన్నారు. రుద్రాపూర్‌ బీజేపీ అధ్యక్షుడు ఫోన్‌లో మల్లికార్జున్‌ను బెదిరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి శివయ్య, నాయకులు పాల్గొన్నారు.

చైనా మాంజా.. డేంజర్‌

ప్రభుత్వం నిషేధించినా జోరుగా విక్రయాలు

- మాంజాకు చిక్కుకుని పక్షులు మృత్యువాత
- నియంత్రణ చర్యలు తీసుకోని పోలీస్‌, అటవీశాఖ
- పతంగులు ఎగురవేసేవారికి గాయాలు


సిద్దిపేటలోని లాల్‌ కమాన్‌, గాంధీ రోడ్డులో పతంగులు, మాంజా విక్రయిస్తున్న దృశ్యం

సాక్షి, సిద్దిపేట: సంక్రాంతి అంటేనే పిండి వంటలు, ముగ్గులు, పతంగులు గుర్తుకొస్తాయి. పండగకు వారం ముందే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేసేందుకు ఆసక్తి చూపిస్తారు. గతంలో పతంగులను ఎగురవేసేందుకు కాటన్‌ మాంజాను వాడేవారు. ప్రస్తుతం చైనా మాంజావైపే యువత మొగ్గు చూపుతోంది. పక్షులు, మనుషులకు గాయాలు అవుతుండంతో 2017లో ప్రభుత్వం చైనా మాంజాను నిషేధించింది. అయినప్పటికీ సిద్దిపేట పట్టణంలో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. ముందు జాగ్రత్తలపై అటవీ శాఖ, పోలీసులు దృష్టి సారించడంలేదు.

- గతంలో దారానికి గాజు పిండి, సాబుదానా, గంధకం, రంగులు వేసి మాంజాను తయారు చేసి వినియోగించేవారు.
- కానీ ప్రస్తుతం మార్కెట్‌లో ప్రమాదకరమైన చైనా మాంజా విక్రయాలు సాగుతుండటంతో యువత వాటివైపే మొగ్గు చూపుతున్నారు.
- రసాయనాలు పూసిన ఈ మాంజాతో పక్షులు, మనుషులకు ముప్పు వాటిల్లుతుండటంతో గతంలోనే ప్రభుత్వం నిషేధించింది.
- చట్టం చేసినా ఇప్పటికీ సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్‌, హుస్నాబాద్‌, చేర్యాల పట్టణాల్లో చైనా మాంజా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.
- గురువారం సిద్దిపేట పట్టణంలోని లాల్‌ కమాన్‌, గాంధీ రోడ్డులో 'సాక్షి' పరిశీలన జరపగా చైనా మాంజా ఐదు వేల మీటర్లు ఉండే రీల్‌ను రూ. 600 నుంచి రూ. 800 వరకు విక్రయిస్తున్నారు.
- మీటర్‌ అయితే రూ. 8కి విక్రయిస్తున్నారు. ఆ మాంజా రీల్‌ పైనా 'నాట్‌ యూజ్‌ ఫర్‌ కైట్‌ ఫ్లైయింగ్‌' అని రాసి ఉన్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదు.
- అయితే చైనా మాంజా సీల్‌ డబ్బాలను మాత్రం వ్యాపారులు వేరే ప్రాంతంలో భద్ర పరుస్తున్నారు. ఒకటి శాంపిల్‌గా చూపించి కావాలంటే లోపలి నుంచి.. మరికొందరు వేరే ప్రాంతం నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

పక్షులకు గాయాలు..

- పతంగులను పోటా పోటీగా ఎగురవేస్తుంటారు. ఈ పోటీలో ఎదుటివారిపై పైచేయి సాధించేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. గాలిపటం దారం తెంపితే వారిదే పైచేయి అవుతుంది. ఇందుకు చైనా మాంజానే వినియోగిస్తున్నారు.
- గాలిపటం ఎగురవేసే వారికి, పక్కనున్న వారి చేతి వేళ్లకు గాయలవుతున్నాయి.
- పతంగులు ఎగురవేసే సమయంలో చెట్లకు, విద్యుత్‌ స్తంభాలకు పతంగులతో పాటు మాంజా చిక్కుకోవడంతో పక్షులు, జంతువులు మృత్యువాత పడుతున్నాయి.
- నిషేధాన్ని అటవీశాఖ అధికారులు కఠినంగా అమలు చేసి పక్షుల ప్రాణాలను కాపాడాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

పతంగులు విక్రయించే వ్యాపారులు చైనా మాంజా విక్రయించొద్దు. పతంగులు విక్రయించే షాపులపై దాడులు నిర్వహించి విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్‌, డీఎఫ్‌ఓ

ధనాధన్‌ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

బ్యాట్‌ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్‌ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్‌ చేయాలని ఉందా? క్రికెట్‌ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి. ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్‌ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్‌ లీగ్‌ (ఎస్‌పీఎల్‌) క్రికెట్‌ టోర్నీ నాలుగో సీజన్‌ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్‌..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్‌ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌ రాబిన్‌ లీగ్‌ పద్ధతిలో టైటిల్‌ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్‌ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్‌-19 జూనియర్‌ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్‌-25 సీనియర్‌ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్‌ స్థాయిలో ఆడేందుకు జూనియర్‌ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్‌ (ప్లస్‌ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్‌ జట్లకు అర్హత ఉంది. సీనియర్‌ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్‌, ఇంజనీరింగ్‌, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్‌ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్‌) చూపించాలి. మ్యాచ్‌ జరిగే సమయంలో బ్యాటర్స్‌, వికెట్‌ కీపర్‌ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్‌ ప్యాడ్‌లు, అండర్‌ గార్డ్స్‌, హ్యాండ్‌ గ్లౌవ్స్‌, వైట్‌ డ్రెస్‌, వైట్‌ షూస్‌ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్‌ నంబర్లు 9666572244

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

ఇంటికి తాళం వేస్తున్నారా!

జరభద్రం అంటున్న సైబరాబాద్‌ పోలీసులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంక్రాంతి పండగ సంబరాలను జరుపుకునేందుకు ఉపాధి కోసం వచ్చిన వలసదారులు స్వగ్రామాలకు వెళ్లేందుకు వరుస కట్టారు. దాంతో సైబరాబాద్‌ పోలీసులు జరభద్రమంటూ సోషల్‌ మీడియాలో ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. ఊరికి వెళ్లే వారు అవసరమైతే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సుచిస్తున్నారు. అదే మాదిరిగా విలువైన వస్తువులను, బంగారు ఆభరణాలను, నగదును ఇంట్లో ఉంచరాదని హెచ్చరిస్తున్నారు. అవసరమైతే వాటిని లాకర్లలో భద్రపరుచుకోవాలంటున్నారు. ఎక్కువ రోజులు స్వగ్రామంలో ఉండే ఉద్దేశంతో ఊరికి వెళ్లేవారు అవసరమైతే రాత్రి వేళలో తెలిసిన వారిని ఇంట్లో ఉండే విధంగా శ్రద్ధ తీసుకుంటే బాగుంటుందన్నారు. ద్విచక్ర వాహనాలకు తాళలు వేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని అవసరమైతే దానిని ఎప్పటికప్పుడు ఆన్‌ లైన్‌లో మొబైల్‌లో ప్రత్యక్షంగా పరిశీలిస్తూ ఉండాలని కోరుతున్నారు. ఎవరైనా కాలనీలలో అనుమానాస్పదంగా సంచరిస్తే డయల్‌ 100కు లేదా స్థానిక పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరుతున్నారు. ప్రజల భద్రత తమ లక్ష్యం అంటున్నారు సైబరాబాద్‌ పోలీసులు. సోషల్‌ మీడియాలో సైబరాబాద్‌ పోలీసుల సూచనలు హల్‌చల్‌ చేస్తున్నాయి. సైబరాబాద్‌ పోలీసులు సోషల్‌ మీడియాలో సూచనలు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు శుక్రవారం జరిమానా విధించింది. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్‌ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్‌ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 11 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్‌బాబు రూ.25,500 జరిమానా విధించారు.

డబ్బు చెల్లింపులో గొడవ.. కత్తితో దాడి

పటాన్‌చెరుటౌన్‌: డబ్బు చెల్లింపు గొడవ కత్తిపోటుకు దారితీసింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు సందీప్‌ కుమార్‌ షా బతుకుదెరువు కోసం బీహార్‌ నుంచి వచ్చాడు. పట్టణంలోని అంబేద్కర్‌ కాలనీలో నివాసం ఉంటున్నాడు. రోజువారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత శనివారం సందీప్‌ కుమార్‌ షా ఓ ఈవెంట్‌కి పనివారు అవసరం ఉందని వారి రాష్ట్రానికి వ్యక్తి సురేందర్‌(32)తో పాటు మరి కొంతమందిని తీసుకొని వెళ్లాడు. వెళ్లిన ఈవెంట్‌ వద్ద రెండు గంటలు అదనంగా ఉండటంతో రూ. 500తో పాటు మరో రూ.200 కలిపి సురేందర్‌కు చెల్లించాడు. అయితే సమయం ఎక్కువైందని రూ.వెయ్యి ఇవ్వాలని సురేందర్‌ డిమాండ్‌ చేశాడు. దీంతో సందీప్‌కుమార్‌ ఈవెంట్‌ నిర్వాహకులు అదనంగా రూ.200 ఇచ్చారని చెప్పి పంపాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సందీప్‌ కుమార్‌ షా ఇంటికి సురేందర్‌ వచ్చి అదనంగా రూ.300 ఇవ్వాలని వాగ్వాదానికి దాగాడు. తన వెంట తెచ్చిన కూరగాయల కత్తితో సందీప్‌ కుమార్‌ షాపై దాడి చేయడంతో గాయపడ్డాడు. స్థానికుల సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేసుకొని పటాన్‌ చెరు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

'టెక్నాలజీకి అనుగుణంగా ముందుకు సాగాలి'

జిన్నారం(పటాన్‌చెరు): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలని రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌ పర్సన్‌ సునితారెడ్డి సూచించారు. గుమ్మడిదల గ్రామంలోని వివేకానంద గ్లోబల్‌ హైస్కూల్‌లో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సునితారెడ్డి మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలే తప్ప దుర్వినియోగం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్‌ మహిపాల్‌రెడ్డి, ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీలు కుమార్‌గౌడ్‌, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ నర్సింహ్మారెడ్డి, పాఠశాల డైరెక్టర్‌ నందిని పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీడిపల్లి గ్రామానికి చెందిన పాలభరత్‌ గౌడ్‌, సురేశ్‌ బైక్‌పై కాళ్లకల్‌ గ్రామానికి వెళ్లారు. తిరిగి తూప్రాన్‌ వస్తున్న క్రమంలో రాంగ్‌ రూట్‌లో వస్తున్న జేసీబీ బైకును ఢీకొట్టడంతో వారు కిందపడి గాయపడటంతో గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మేడ్చల్‌కు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక ఇద్దరి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్‌: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గజ్వేల్‌ మండలం దాతర్‌పల్లిలో చోటు చేసుకుంది. శుక్రవారం గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దాతర్‌పల్లి గ్రామానికి చెందిన రైతు పిట్ల అలియాస్‌ శ్రీగిరిపల్లి నాగభూషణం(48) పంటలు సాగు చేస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక కొంతకాలంగా సతమతమవుతున్నాడు. గురువారం సాయంత్రం పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే గజ్వేల్‌ ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి నాగభూషణం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో..

మిరుదొడ్డి(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులు తాళలేక తీవ్ర మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ధర్మారంలో శుక్రవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెప్యాల రాజయ్య శ్యామల దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. వీరంతా కూలి పనులు చేసుస్తున్నారు. రాజయ్య పెద్ద కుమారుడు అజిత్‌ (21) కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. నిలువ నీడలేని కొన్ని కుటుంబాలు గ్రామంలో అధికారికంగా ప్రారంభించని డబుల్‌ బెడ్‌రూం ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. అజిత్‌ కుటుంబం కూడా ఓ డబుల్‌ బెడ్‌ రూంలో తలదాచుకుంటున్నారు. ఇందులో సరైన వసతులు లేక వాటిని సమకూర్చుకోవడానికి మరింత అప్పులు చేశారు. అప్పులు తీర్చడానికి కుటుంబ సభ్యులు కష్టపడుతున్నా భాకీలు తీర్చలేకపోతున్నారు. కాగా ఇటీవల పనిచేయకుండా ఖాళీగా తిరుగుతుతున్నావని అజిత్‌ను తండ్రి మందలించాడు. తండ్రి మందలింపుతో పాటు ఆర్థిక ఇబ్బందులు మరింత కుంగదీయంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో మనోవేదనకు గురై డబుల్‌ బెడ్‌రూంలో ఉరి వేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్‌ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం అజిత్‌ మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సర్వే అధికారులపై తండావాసుల దాడి

కారు అద్దాల ధ్వంసం
34 మందిపై కేసు నమోదు


గాయపడిన సర్వేయర్‌

పెద్దశంకరంపేట(మెదక్‌): సర్వే చేయడానికి వెళ్లిన అధికారులపై తండావాసులు దాడి చేయడంతో ఓ సర్వేయర్‌కు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దశంకరంపేట మండలం కట్టెల వెంకటాపూర్‌ శివారు 161వ జాతీయ ప్రధాన రహదారి పక్కన గల 55, 56 సర్వే నంబర్లలో మన్నె సుదర్శన్‌ తన హద్దులు చూపాలని సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ సర్వే నంబర్లలో 4 ఎకరాల 36 గుంటల భూమి ఉంది. ఈ విషయంలో కొంత కాలంగా వివాదం నెలకొంది. ఈ విషయంపై సర్వే చేపట్టేందుకు శుక్రవారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ శశికుమార్‌, సర్వేయర్‌ సుల్తానాబేగం, ఆర్‌ఐ ప్రభాకర్‌, రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. విషయం తెలుసుకున్న రాఘవానితండా గిరిజనులు ఈ భూమి తమదేనని, ఇందులో సర్వే చేయవద్దని తమపై దాడి చేసినట్లు అధికారులు చెప్పారు. తండా వాసులు ఆగ్రహంతో అక్కడ ఉన్న రెస్టారెంట్‌లోని ఫర్నీచర్‌తో పాటు అధికారుల కారు అద్దాలను ధ్వంసం చేశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అల్లాదుర్గం సీఐ జార్జి, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి పేట ఏఎస్‌ఐ అశోక్‌ సంఘటనా స్థలానికి చేరుకొని తండా వాసులను సముదాయించారు. అధికారుల ఫిర్యాదు మేరకు 34 మంది తండా వాసులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ అశోక్‌ తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న తండావాసులు

భూములు తీసుకోవద్దంటూ రైతుల ధర్నా


ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రంజోల్‌ రైతులు

జహీరాబాద్‌ టౌన్‌: హెచ్‌ఎండీఏ ప్లాట్ల కోసం తమ భూములను తీసుకోవద్దంటూ జహీరాబాద్‌ పట్టణ పరిధి రంజోల్‌కు చెందిన రైతులు శుక్రవారం ఆర్డీఓ, తహసీల్దార్‌ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంచందర్‌ ధర్నాలో పాల్గొని మాట్లాడారు. రంజోల్‌ పరిధిలోని 141, 138 సర్వేనంబర్‌లో గల ఎస్సీ, బీసీ, మైనార్టీలకు చెందిన భూముల్లో ప్రభుత్వం వెంచర్‌ వేయాలని నిర్ణయించిందన్నారు. ఈ భూములను ప్లాట్ల కోసం ఇవ్వాలని రెవెన్యూ అధికారులు రైతుల వేధిస్తున్నారని ఆరోపించారు. పేదలకు ఇచ్చిన భూమిని తీసుకుంటే వారు ఎట్లా బ్రతికేదని ప్రశ్నించారు. ప్రభుత్వానికి దళిత, బడుగు బలహీన వర్గాల భూములే గుర్తుకు వస్తాయని విమర్శించారు. అవసరాల కోసం ప్రభుత్వం భూమలును తీసుకున్నా తిరిగి భూములను ఇవ్వడంలేదన్నారు. ఇప్పటి వరకు ఒక్క దళితుడికి భూమిని తీసుకుని తిరిగి భూమి ఇవ్వలేదన్నారు. ఎకరం రూ.కోటి పలుకుతున్న భూములకు కూడా తక్కువ ధర చెల్లించి బలవంతంగా తీసుకొంటున్నారని ఆరోపించారు. రంజోల్‌ రైతుల భూములను తీసుకొనే ప్రయత్నాలను విరమించుకోవాలని, లేని యెడల ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. బుర్దిపాడ్‌ గ్రామంలో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ పేదలకు ఎందుకు పంచడంలేదని ప్రశ్నించారు. ఈ మేరకు ఆర్డీఓ, తహసీల్దార్‌ కార్యాలయం అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుకుమార్‌, లక్ష్మణ్‌, నర్సింలు, లలితమ్మ, చంద్రయ్య, రాములు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అగ్నిప్రమాదం

- బూడిదైన బొమ్మల దుకాణాలు
- బోరుమన్న బాధితులు
- నాచగిరి క్షేత్రం వద్ద ఘటన


కాలిపోతున్న బొమ్మల దుకాణాలు

వర్గల్‌(గజ్వేల్‌): నాచగిరి క్షేత్రం వద్ద బొమ్మల దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. రెండు పూర్తిగా కాలిపోగా, మరో మూడింటికి పాక్షికనష్టం వాటిల్లింది. గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు బాధితులు చెబుతున్నారు. బొమ్మలు, గాజులు తదితర సామగ్రి, రేకుల షెడ్లు కాలిపోవడంతో రూ.5 లక్షల పైచిలుకు నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. బాధితులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వర్గల్‌ మండలం నాచారానికి చెందిన యెండపల్లి రమణి, సంగెం సువర్ణ, సంగెం వనజ, సంగెం మంగమ్మ, సంగెం సాలమ్మ తదితరులు నాచగిరి క్షేత్రం వద్ద బొమ్మల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి మంటల్లో తగలబడిపోతున్న బొమ్మల దుకాణాలను పలువురు గమనించి సంబంధితులకు సమాచారమందించారు. బాధితులు అక్కడికి చేరుకుని తేరుకునేలోపే పక్కనే ఉన్న దుకాణాలకు మంటలు వ్యాపించాయి. ప్లాస్టిక్‌ కవర్లు, కర్రలతో నిర్మించిన షెడ్లు కావడం, అందులోని ప్లాస్టిక్‌ బొమ్మలు, టెడ్డీబేర్‌ బొమ్మలు ఉండటంతో స్వల్పకాలంలో కాలిపోయాయి. మంటలు వ్యాపించకముందే కొన్ని దుకాణాల్లో సామగ్రిని బయటకు తెచ్చుకున్నారు. ప్లాస్టిక్‌ సామగ్రి కావడంతో మంటలు అదుపుచేసే అవకాశం లేక బాధితులు నిస్సహాయ స్థితిలో బోరుమన్నారు. యెండపల్లి రమణి, సంగెం సువర్ణ దుకాణాలు పూర్తిగా కాలిపోవడంతో రూ. 4.5 లక్షల నష్టం వాటిల్లిందని, సంగెం వనజ, సంగెం మంగమ్మ, సంగెం సాలమ్మ దుకాణాలకు పాక్షిక నష్టం జరిగిందని ఆర్‌ఐ నాగరాజుగౌడ్‌ తెలిపారు. బాధితుల ఫిర్యాదుమేరకు గౌరారం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


డ్వాక్రా లోన్‌ తీసుకొని బొమ్మలు తెచ్చాం:




మేడ్చల్‌ సమీప ఘనపురం బండ వెంకటేశ్వరస్వామి జాతర, ఇస్లాంపూర్‌ రామప్ప జాతరలో బొమ్మలు అమ్ముకుంటే నాలుగు పైసలొస్తయని ఆశతోని మహిళా మండలి డ్వాక్రా లోన్‌ తీసుకున్నా. హైదరాబాద్‌ నుంచి బొమ్మలు, గాజులు తదితర సామగ్రి కొని దుకాణంలో స్టాక్‌ పెట్టినం. గుర్తుతెలియనోళ్లు దుకాణానికి నిప్పు పెట్టిండ్రు. విషయం తెలిసి మేము ఇంటి నుంచి దుకాణానికి వచ్చేసరికి మొత్తం బూడిదైపోయింది. కొత్త స్టాక్‌, పాత స్టాక్‌ మొత్తం కాలిపోయి రూ. 3లక్షల దాక నష్టపోయా. ప్రభుత్వం ఆదుకోవాలి.
– యెండపల్లి రమణి, బాధితురాలు

కాలువలోకి దూసుకెళ్లిన బైకు

సికింద్లాపూర్‌ తండా యువకుడి మృతి


రవి మృతదేహం


రవి (ఫైల్‌)

జోగిపేట(అందోల్‌): బైకు అదుపుతప్పి కాలువలోకి పడటంతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హత్నూర మండలం సికింద్లాపూర్‌ తండాకు చెందిన రవి జోగిపేటలో ఉంటున్నాడు. వరుణ్‌ మోటార్స్‌ షోరూంలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి అందోల్‌ నుంచి జోగిపేట వస్తుండగా బైకు అదుపు తప్పి అయ్యప్ప స్వామి దేవాలయ సమీప కాలువలోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. విషయం తెలుసుకున్న బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. శుక్రవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సామ్యానాయక్‌ తెలిపారు. జిల్లా టీబీఎస్‌ అధ్యక్షుడు మాంజా నాయక్‌, గణపతి షుగర్‌ ఫ్యాక్టరీ డైరెక్టర్‌ జైపాల్‌నాయక్‌ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌



REAL ESTATE

LAND FOR SALE

■ గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్‌ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు, క్లబ్‌ హౌస్‌ కూడకలదు. ఫోన్‌ : 9951297569. [HA-868]

SERVICES

■ బాలాజీ గోల్డ్‌ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్‌ ధరకు కొనబడును (స్పాట్‌ క్యాష్‌), తాకట్టు షిఫ్టింగ్‌ చేయబడును. 90320 40019. [T-1740]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586 [G-776024]

■ సంగారెడ్డి చౌరస్తాలో గల ఆద్యాలాడ్జ్‌ & S.M రెసిడెన్సీ కొరకు లాడ్జ్‌ మేనేజర్‌, నైట్‌ సెక్యూరిటీగార్డ్‌ అర్జెంట్‌గా కావలెను. సెల్‌: 9848024627 [H-1222067]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌/ డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.